
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6 కనిష్ఠం 26.5



ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో

కామారెడ్డి రూరల్, మే 21: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం దేవునిపల్లి పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న ప్రతీ వైద్య సంబంధిత పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని, గర్భిణులు ప్రతినెల వైద్యులతో పరీక్షలు చేయించుకునేలా ఆశావర్కర్లు చూడాలని తెలిపారు. ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు ఆసుపత్రికి వస్తున్న ప్రతీ ఒక్కరికి వైద్యం అందిస్తూ మందులను అందించాలని సూచించారు.



అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గల షుగర్ ఫ్యాక్టరీ

పారిశ్రామిక.. ప్రగతి ఏదీ?

- పరిశ్రమలు తరలిరాలే.. ఉపాధి దొరకలే..
- పారిశ్రామికంగా జిల్లా వెనుకంజ
- గత ప్రభుత్వంలో అన్ని హామీలకే పరిమితం
- జుక్కల్ నియోజకవర్గానికి కలగానే ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ
- ప్రతిపాదనకే పరిమితమైన తోళ్ల పరిశ్రమ
- లింగంపల్లిలో కొనసా..గుతూనే ఉన్న జ్యూట్ బ్యాగుల పరిశ్రమ
- కలగానే జంగంపల్లిలో పారిశ్రామిక కారిడార్
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టి సారించేనా?

కామారెడ్డి, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకు జాతీయ రహదారులతో పాటు రైల్వేమార్గం, నీటి ప్రాజెక్టులు, ఆయా ఖనిజ సంపద, అనుకూలమైన భూములు ఉన్నప్పటికీ పరిశ్రమలు జిల్లాకు తరలిరావడం లేదు. జిల్లాలో రైస్‌మిల్లులు, రెండు షుగర్ ఫ్యాక్టరీలు, ఫార్మా కంపెనీలు తప్ప పెద్దగా చెప్పుకోదగిన పరిశ్రమలు లేవు. కామారెడ్డి జిల్లాను పారిశ్రామిక కారిడర్‌గా మార్చుతామని ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని తోలు పరిశ్రమ, జ్యూట్ బ్యాగుల ఇండస్ట్రీ, ఫార్మా లాంటి కంపెనీలను తీసుకోస్తామని గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎన్నో హామీలు కురిపించి యువతి, యువకుల్లో, నిరుద్యోగుల్లో ఆశలు నింపారు. కానీ ఇప్పటి వరకు ఇందులో ఏ ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు తరలిరాకపోవడంతో యువతకు నిరాశే మిగిలింది. జీవనోపాధి, ఆరోగ్యం, విద్య, ఉపాధి అంశాలను పరిగణలోకి తీసుకుని గత ఐదేళ్లుగా వెల్లడిస్తున్న నివేదికల్లో జిల్లా పారిశ్రామిక రంగంలోనూ ఉపాధిలోనూ వెనుకబడే ఉంటుంది. ముఖ్యంగా పారిశ్రామికంగా అడుగులు ముందుకు పడడం లేదు. దీంతో ఉపాధి ఉద్యోగాల కోసం జిల్లాకు చెందిన వేలాది మంది యువతి, యువకులకు నిరీక్షణ తప్పడం లేదు.

హామీకే పరిమితమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

జుక్కల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని 2018లోనే మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ధాన్యం ఉత్పత్తిలో జిల్లా ఏటా రాష్ట్రస్థాయిలో నాలుగైదు స్థానాల్లో నిలుస్తోంది. ఇటీవల కాలంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. దీనికి తోడు సోయా, జొన్న, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసర్లు లాంటి పప్పు దినుసు పంటల విస్తీర్ణం కూడా జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కువగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో సోయా, పప్పు దినుసుల ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గంలో జాతీయ రహదారి 161 అందుబాటులోకి వచ్చింది. అటు మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు రాష్ట్ర రాజధానికి రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. తాగు, సాగు నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నా ఆ దిశగా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన ఆ దిశగా చర్యలు చేపట్టాలని యువతి, యువకులను నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డిలోను అనువైన పరిస్థితులు ఉన్నాయి. ఈ దిశగా అడుగులుపడితే కామారెడ్డి జిల్లా ఆహార పరిశ్రమల హబ్‌గా మారే అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనకే పరిమితమైన తోళ్ల పరిశ్రమ

ఎల్లారెడ్డి శివారులో తోళ్ల పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదన చాన్నాళ్లుగా ఉంది. ఇది అందుబాటులోకి వస్తే వందలాది మందికి ఉపాధి లభిస్తోంది. గతంలో మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర మంత్రిని సైతం కలిశారు. రూ.270 కోట్ల ఆదాయం అంచనాతో ప్రతిపాదనలు సమర్పించారు. 57 ఎకరాల్లో పెట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ఈ పరిశ్రమకు ముందడుగు పడలేదు. సదాశివనగర్ మండలం లింగంపల్లి శివారులో ఆహార శుద్ధి పరిశ్రమల పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 675 ఎకరాలను కేటాయించింది. ఆయా భూములను అభివృద్ధి చేసేందుకు గాను టెండర్లు పిలిచారు. ఈ ప్రాంతంలో రూపాయలు 254 కోట్లతో జ్యూట్ బ్యాగ్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ఓ ప్రైవేట్ కంపెనీ సైతం ముందుకొచ్చింది. భూ సేకరణ విషయంలో బాధితులకు, ప్రభుత్వానికి మధ్య వివాదం తలెత్తడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. చివరకు భూ బాధితులకు వేరేచోట భూములు కేటాయించినట్లు సమాచారం. దీంతో వివాదం సదుమణిగినా జూట్ బ్యాగుల పరిశ్రమ పనులు గత రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతునే ఉన్నాయి. ఈ జూట్ బ్యాగుల పరిశ్రమ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

పారిశ్రామిక కారిడర్ ఉత్తదేనా?

కామారెడ్డి డివిజన్ పరిధిలో 44వ జాతీయ రహదారి వెంట ఇప్పటికే పలు ఫార్మా కంపెనీలతో పాటు చక్కెర, రైస్‌మిల్లులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కామారెడ్డికి మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామిక కారిడర్‌గా మార్చుతామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి భిక్కనూర్ మండలంలోని జంగంపల్లిలో 115 ఎకరాల భూమిని కేటాయించారు. కామారెడ్డిలో ఆటో నగర్‌కై 50 ఎకరాలు, బాన్సువాడలో ఆటోనగర్‌కై 50 ఎకరాలు, నిజాంసాగర్ మండలం అచ్చంపేటలో 500 ఎకరాలు పరిశ్రమల ఏర్పాటుకై కేటాయించారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమిని కేటాయిస్తూ ప్రతిపాదనలు చేశారే తప్ప సర్వేలు మాత్రం ముందుకు జరగలేదు. దీంతో ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు కూడా ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో ప్రధానంగా రైస్‌మిల్లులతో పాటు రెండు చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. ఎక్కువగా వరి సాగు ఉంటుంది. అయితే నూకలతో ఇథనల్ తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. నూకలతో ఇథనల్ ఉత్పత్తి నుంచి ప్రత్యామ్నాయమని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో రెండు షుగర్‌ఫ్యాక్టరీల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇథనల్ కర్మాగారాల నుంచి ఏటా 45 వేల లీటర్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఇదేవిధంగా నూకల నుంచి తయారు చేసే పరిశ్రమలను స్థాపిస్తే రైతులతో పాటు నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆయా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతి, యువకులతో పాటు స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- ఎస్పీ సింధూశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

సదాశివనగర్, మే 21: రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. సదాశివనగర్ మండలం మల్లన్నగుట్ట వద్ద గల అశోక్ గార్డెన్‌లో సీపీఆర్ ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులవుతునే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం జిల్లాలో 550 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అయిన హెల్మెట్ ధరించకపోవడం రాంగ్‌రూట్‌లో వెళ్లడం ఓవర్ లోడింగ్‌లో వాహనాలు నడపడం అధిక వేగం ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి బండి నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం ప్రధాన కారణాలని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్య క్రమంలో శిక్షణ ఐపీఎస్ కాజల్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌లు, సదాశివ నగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ రాజు, వైద్యాధికారిని ఆస్మా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, మండల అధ్యక్షుడు కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ దొంగల అరెస్టు

కామారెడ్డి టౌన్: జిల్లా తో పాటు ఇతర జిల్లాల్లో సిగరెట్ గోదాముల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. మంగళవారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన కుమావత్ ఖుందారాం ప్రస్తుతం సంగా రెడ్డి జిల్లా పటాన్‌చెరులో నివాసం ఉండే వ్యక్తితో పాటు రాజస్థాన్‌కు చెంది న కుమావత్ లక్ష్మణ్‌రావులు, కుమావత్ ఘన్‌శ్యామ్‌లు కలిసి సిగరెట్ గోదాముల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల కామా రెడ్డిలోని ఓ సిగరేట్ గోదాములో కాటన్‌లను దొంగలించుకుని పోయారని యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం సిరిసిల్లా రోడ్డు బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా ఖుందారం, లక్ష్మణ్‌రావులను అరె స్ట్ చేశామని తెలిపారు. వారిని విచారించగా సిగరెట్ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారని వారితో పాటు మరో వ్యక్తి ఘన్‌శ్యామ్ ఉన్నాడని అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై రాచకొండ పరిధిలోని నకిరేకల్, కర్ణాటకలోని హ్యూమనాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, సైబరాబాద్ పరిధిలోని అమన్‌గల్, వనపర్తి, వరంగల్ కేయూసీ పరిధిలో కేసులు నమోదు అయినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 8 లక్షల నగదు, లక్ష్మణ్‌రావ్ అకౌంట్‌లలో ఉన్న డబ్బులు రూ.7.50లక్షలు, షిఫ్ట్ వీడీఐ కారు, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక గడ్డపార, ఒక స్క్రూడ్రైవర్‌ను రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో.. ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి శరత్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి శరత్

కామారెడ్డి టౌన్, మే 21: జిల్లాలో మిగిలిన 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నాలుగు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఇందుకు సహకరి ంచిన మిల్లర్లను ప్రశంసిస్తూ ఇంకా మిగిలిన 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు సహకరించాలని రైస్‌మిల్లర్లను కోరారు. వాతావరణం పొడిగా ఉన్నందున రాబోయే నాలుగు రోజుల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయుటకు ప్రతీ కేంద్రానికి ప్రత్యేకాధికారులను నియమించి తహసీల్దార్, వ్యవసాయాధికారులు బాధ్యులను చేస్తూ మానిటరింగ్ చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం రోజువారి లక్ష్యం నిర్ధేశించుకుని కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌లు, మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సహకార, ఐకేపీ అధికారులు రోజు కేంద్రాలను పరిశీలించి ధాన్యం తూకం వేసిన నాలుగు గంటల్లో లోడింగ్ చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించి అక్కడ మరో 5 గంటల్లో అన్‌లోడింగ్ అయ్యే విధంగా పర్యవేక్షించాలన్నారు. సకాలంలో లారీలు అందుబాటులో లేకపోతే రోడ్డుపై వెళ్లే లారీలను, ట్రాక్టర్లను ఆపి లోడింగ్ చేసి పంపాలని సూచించారు. నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేయకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోళ్ల విషయంలో అధికారులు, రైస్‌మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి వంద శాతం కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, ఇన్‌చార్జ్ జిల్లా మేనేజర్ నిత్యానందం, డీసీవో రమ్య, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయ పూర్వ వైభవానికి చర్యలు!

- గత కొన్ని సంవత్సరాల క్రితం నూతన హంగులతో ఆలయ పునఃనిర్మాణం
- భక్తుల తాకిడి తగ్గడంతో ఉడిపి పండితులను ఆశ్రయించిన గ్రామపెద్దలు
- ఆలయంలో వాస్తు దోశాలు ఉన్నట్లు గుర్తింపు
- ఆలయంలో మొదటిసారి 2022లో జీర్ణోద్ధరణ పూజలు
- మరల ప్రస్తుతం తొమ్మిది రోజుల పాటు వాస్తు నివారణ కార్యక్రమాలు
- ఉడిపి నుంచి పండితుల రాక



ప్రస్తుతం నూతన హంగులతో నిర్మించి ఆలయం (ఇన్‌సెట్‌లో మూల విరాట్టు)

భిక్కనూరు, మే 21: దక్షిణకాశీగా బాసిల్లు తున్న సిద్ధరామేశ్వర ఆలయానికి ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర ఉంది. తపస్సంపన్నులైన సిద్ధగిరి, రామగిరి అనే యోగి పుంగవులు భిక్షాటన చేస్తూ భిక్షపతి ప్రోలు(ప్రసుత్త భిక్కనూరు)కు చేరుకున్నారని ఈ భిక్కనూరు గ్రామం వీరికి అతి వైభవంగా, ఆశ్చర్యకరంగా కన్పించిందని దీంతో వీరిరువురు ఇక్కడ విశ్రాంతి తీసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఓ సుప్రభాత వేళ ఓ ఆవు ఈ యోగి పుంగవులకు కొద్ది దూరంలో పుట్టపై పాలు స్రవించి, పుట్ట చుట్టు ప్రదక్షణలు చేసి పూర్వాభిముఖంగా పరిగెత్తిందని, ఇది చూసిన యోగి పుంగవులు సైతం పుట్ట చుట్టూ ప్రదక్షణలు చేసి అక్కడ మరుసటిరోజు కూడా అక్కడే నిద్రించారు. ఆ రాత్రి పరమ శివుడు యోగి పుంగవులకు స్వప్నంలో ప్రత్యక్షమై నేను ఈ పుట్టలో ఉన్నానని ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని వారికి ఆదేశించాడట. ఆలయ నిర్మాణానికి కావల్సిన ధనాన్ని పోగు చేసేందుకు శివుడు వారికి ఒక తాళ్లపత్ర గ్రంథాన్ని ఇచ్చి అదృశ్యమయ్యాడని, యోగి పుంగవులు ఆలయ నిర్మాణానికి సిద్ధమై ఒక చక్రాల బండిని సిద్ధం చేసి దానికి నాగబండి అని నామకరణం చేసి, శివుడు ఇచ్చిన తాళ్లపత్ర గ్రంథాన్ని దానిపై పెట్టి దేశమంతా తిరిగి నిధులు సమకూర్చి ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతుంది. సిద్ధగిరి, రామగిరి ఇరువురు ఈశ్వరుడి ఆలయాన్ని నిర్మించడంతో దీనికి శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంగా పేరు వచ్చినట్లు పూర్వీకులు చెబుతారు.

నూతన హంగులతో నిర్మాణం

ఈ ఆలయానికి యోగిపుంగవులు రాతి కట్టడంతో నిర్మించగా ఆలయ ప్రాంగణంలో ఒక బావి, ఆలయం వెనుక భాగంగా మూలబావి, అమ్మవారి ఆలయంతో పాటుగా మరికొన్ని ఉప ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణం జరిగినప్పటి నుంచి ఆ ఆలయానికి ఎంతగానో ఆదరణ ఉండేది. ఈ ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకునేవారు. స్వామి వారు సైతం భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందాడు. కానీ కొన్ని సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని ప్రభుత్వం, దాతల సహకారంతో నూతన హంగులతో గతంలో కంటే (శ్రీ యోగి పుంగవులు నిర్మించిన దాని కంటే) పెద్దగా నిర్మించారు. ఆ సమయంలో ఆలయ ప్రాంగణంలో కొన్ని మార్పులు జరిగాయి. దీంతో రానురానూ భక్తుల తాకిడి తగ్గుతూ వస్తోంది.

ఆలయంలో చాలా వాస్తు దోశాలు ఉన్నట్లు గుర్తింపు

ఆలయాన్ని నూతన హంగులతో పునఃనిర్మించిన సమయంలో ఆలయంలో కొన్ని మార్పులు జరిగాయి. అప్పటి వరకు భక్తులతో కిటకిటలాడిన ఆలయం రానురాను భక్తుల తాకిడి తగ్గుతూ వస్తోంది. దీంతో గత 2022 సంవత్సరంలో గ్రామంలోని అన్ని కుల సంఘాలతో చర్చించి గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామానికి చెందిన అడ్వకేట్ రాంరెడ్డి సహకారంతో ఉడిపిలోని వాస్తుశాస్త్రంలో ఎంతో అనుభవం కలిగిన పండితులను సంప్రదించారు. అదే సంవత్సరం సెప్టెంబరులో ఉడిపి పండితులు ఆలయానికి చేరుకుని ఆలయాన్ని సందర్శించి ఆలయంలో చాలా వాస్తుదోశాలు, గత చాలా సంవత్సరాల క్రితం దోమకొండ రాజులు ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న సమయంలో యోగి పుంగవులతో విరోధించిన కొందరు వారిపై కోపంలో స్వామివారి మూర్తి శిరోభాగాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించారు. దీంతో పాటుగా ఆలయానికి అనుసంధానంగా ఉన్న భిక్కనూరు, దోమకొండ పరిధిలోని కొన్ని ఆలయాలు పట్టించుకునేవారు లేక అంతరించి పోయాయని, మరికొన్ని శిథిలావస్థలో ఉన్నాయని ఉడిపి పండితులు గుర్తించారు. వెంటనే ఆలయ ప్రాంగణంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలను వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న భిక్కనూరు చుట్టూ ఉన్న ఆలయాలను శుభ్రం చేసి పూజ కార్యక్రమాలను పునరుద్ధరించారు. మరల ప్రస్తుతం రెండవ విడతగా తొమ్మిది రోజుల పాటు ఆలయంలో వాస్తు నివారణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

తొమ్మిది రోజుల పాటు వాస్తు నివారణ పూజలు

ఉడిపి పండితుల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఆలయంలో వాస్తు నివారణ కార్యక్రమాలను ప్రారంభించారు. 21న సర్ప నమస్కారం, వేద పారాయణం, 22న వేద పారాయణం, 23న వేద పారాయణం, 24న నమస్కార మంగళం, భూవరహా హోమం, ఆశ్లేష బలి, అఘోర హోమం, సర్పసూక్త హోమం, వేద పారాయణం, 25న రుద్ర హోమం, పాశుపత హోమం, ఐకమత్య హోమం, గోసూక్త హోమం, నవగ్రహ హక్షమం, వేద పారాయణం, 26న బాగవత పారాయణం, గోసూక్త హక్షమం, తిల హోమం, వాస్తు హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం, 27న తిలా హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం, 28న త్రికాల పూజ, ద్వాదశి మూర్తి అరాధన, దంపతి పూజ, వాయస్ పూజ, 29న విష్ణు సాయుజ్యం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పూర్తి సహకారం అందజేస్తున్న అడ్వకేట్ రాంరెడ్డి కుటుంబ సభ్యులు

వాస్తు శాస్త్రంలో ఎంతో అనుభవం కలిగిన ఉడిపి పండితులను కలవడం, వారితో వాస్తుదోశ పూజలు చేయడమనేది ఎంతో ఖర్చుతో, సమయంతో కూడుకున్నది. ఆలయానికి ఏ విధంగానైనా పూర్వ వైవభం తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో అడ్వకేట్ రాంరెడ్డి కుటుబ సభ్యులు ఈ కార్యక్రమాలకు అయ్యే ఖర్చులను భరించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు తెలిపారు. ఆలయంలో గతంలో జరిగిన జీర్ణోద్ధరణ, ప్రస్తుతం జరుగుతున్న వాస్తు నివరాణ కార్యక్రమాలకు, పండితుల ఖర్చుతో కలిసి ఇప్పటి వరకు రూ.లక్షల్లో ఖర్చు అయినట్లు వారు వివరించారు.

గతంలో లేనిది ఇప్పుడే వాస్తు గుర్తొంచిందా?

ఎంతో మహిమ కలిగిన శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో గతంలో ఎన్నడూ లేని వాస్తు దోశాలు ఇప్పుడే గుర్తొంచాయా, ఆలయాన్ని పనర్నిర్మాణం చేపట్టిన సమయంలో వాస్తు పండితులను కలవలేదా అని పలువురు ప్రశ్నిస్తున్న పరిస్థితి. ఎంతో పేరున్న ఆలయాన్ని కొందరు నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో చేపడుతున్న వాస్తు నివారణ కార్యక్రమాలతో పాటుగా ఆలయాన్ని ఎన్నో సంవత్సరాలుగా పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీలు ఇచ్చి మరిచిపోయారని ఇప్పటికైనా ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని, ఆలయానికి వచ్చే రోడ్డు డబుల్ చేయాలని, ఎల్లమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జిని పెద్దదిగా చేయాలని, ఆలయ అభివృద్ధికి దాతలు ఇప్పటి వరకు ఇచ్చిన విరాళాలు, ఖర్చులు వివరాలను వివరించాలని వారు కోరుతున్నారు.



ఆలయంలో వాస్తు నివారణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి, మే 21: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి- రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారిని స్వీట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోత్సవాల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.15430లను దండారూపంలో భక్తులు స్వామి వారి విగ్రహానికి వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభురాంచంద్రం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా భవాని మాతా ఉత్సవాలు ప్రారంభం

బాన్సువాడ, మే 21 : మండలంలోని బుడిమి గ్రామంలో భవాని మాతా ఆలయ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రైతులు ఎడ్లబండ్ల కొరత వలన ట్రాక్టర్లను అందంగా అలంకరించి గుడి చుట్టూ తిప్పారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను ఆలయం వరకు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుందని, రెండో రోజు కల్యాణం, రథోత్సవం, మూడో రోజు కుస్తీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్ పటేల్, తిరుమల్‌రెడ్డి, పెద్దోళ్ళ కాశీరాం, రవీందర్, నాందేవ్, జిన్నా, జగన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా క్రీడాశాఖాధికారి దామోదర్‌రెడ్డి

వాలీబాల్ క్రీడల్లో మరింత ప్రావీణ్యం సంపాదించాలి

తాడ్వాయి, మే 21: విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో మరింత ప్రావీణ్యం సంపాదించాలని కామారెడ్డి జిల్లా క్రీడాశాఖాధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బ్రహ్మణపల్లిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన కోరారు. క్రీడలు విద్యార్థులకు యువకులకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఒక స్థాయిలో నిలబెట్టడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు క్రీడల్లో తర్ఫీదు చేయాలని సూచించారు. ప్రతిరోజు శిక్షణలో ఉంటేనే క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ పుస్తకాల అమ్మకాలు



అమ్మకాలు జరుపుతున్న పుస్తకాలను చూపుతున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డిటౌన్, మే 21: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గౌతమ్‌మోడల్ స్కూల్‌లో పుస్తకాలను అమ్ముతున్నట్లు ఏబీవీపీ నాయకులు ఖలీల్ అన్నారు.మంగళవారం పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీచేసే పుస్తకాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఆ పుస్తకాలపై గౌతమ్ మోడల్‌స్కూల్ అని ప్రింట్ చేసి మరి అత్యధికంగా డబ్బులను అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. పుస్తకాల అమ్మకాల విషయం ఎంఈవో, డీఈవో దృష్టికి తీసుకుపోయిన స్పందన కరువైందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులైన స్పందించాలని లేకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు.

సూపరింటెండెంట్ శ్రీనునాయక్ సస్పెన్షన్

కామారెడ్డిటౌన్, మే 21: జిల్లా వైద్యఆరోగ్యశాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనునాయక్‌ను సస్పెండ్ చేస్తు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి రవీందర్‌నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని ఓ మెడికల్ ఆఫీసర్‌కు అసభ్యకరమైన మెసేజీలు పంపడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు మెడికల్ ఆఫీసర్లు లైంగిక వేధింపులపై గత రెండురోజుల క్రితం రాష్ట్ర మహిళా కమిషన్‌ను సంప్రదించినట్లు సమాచారం. జిల్లా కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయిస్తారని మెడికల్ ఆఫీసర్లు చూసినప్పటికీ ఎలాంటి పురోగతి కన్పించకపోవడంతో మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. నేడు కామారెడ్డిలో కేసులపై విచారణ అనంతరం గురువారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూను కలిసి జరిగిన సంఘటనపై వివరించినట్లు తెలిసింది.

ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా గణేష్‌నాయక్

గాంధారి, మే 21: మండలంలోని గొల్లడితండాకు చెందిన గణేష్ నాయక్‌కు ఎస్‌టీసెల్ ఉపాధ్యక్షుడిగా నియామకపత్రాన్ని ఎస్‌టీసెల్ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ అందించారు. ఈ సందర్భంగా గణేష్‌నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ శివారు హద్దుల పరిశీలన

బాన్సువాడ, మే 21: మండలం కొల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొంత భాగాన్ని బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామ పంచాయతీ పరిధిలోకి విలీనం చేయడాని కోసం మంగళవారం ఎంపీడీవో బషీరుద్దీన్, బీర్కూర్ ఎంపీడీవో భారతిలు కలిసి కొల్లూరు గ్రామంలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. రైతునగర్ కొల్లూరు గ్రామ శివారులోని భూ భాగాన్ని, గ్రామ శివారులోని హద్దులను పరిశీలించారు. త్వరలోనే రెండు గ్రామాల్లో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సృజన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పనికిరాని స్థలం పంచాయతీలకు అప్పగింత

- లే అవుట్లలో పంచాయితీ స్థలంపై ప్రజల అభ్యంతరం
- ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టేదెట్లా
- నాన్ లేఅవుట్ల సంగతేమిటి



ఎడపల్లి పంచాయతీకి ఇచ్చిన స్థలం

ఎడపల్లి, మే 21: ఎడపల్లి మండలం బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై నట్టనడుమ ఉంది. ఇరు పట్టణాల ప్రజలు ఈ ప్రాంతంలో ప్రభుత్వ లేఅవుట్, నాన్ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇట్టి లేఅవుట్ స్థలాల్లో ప్రభుత్వ నిభందనల ప్రకారం కొంత స్థలాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించాల్సి ఉంటుంది. కేటాయించిన స్థలంలో స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం తాగునీటి ట్యాంక్ కాని, అంగన్‌వాడి, పాఠశాల భవనాలు కాని, ఇలా ఏదైన ప్రభుత్వ పరమైన నిర్మాణాలకు ఈ స్థలం వినియోగించాల్సి ఉంటుంది. అయితే పంచాయతీలకు అప్పగించిన లేఅవుట్ స్థలాల భూములలో ఇచ్చిన స్థలం ఎందుకు పనికి రాకుండా ఇష్టారాజ్యంగా ఉంది. దీనిపై స్థానిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు, గ్రామాల ప్రజలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

● ప్రశ్నించేవారు కరువు

లేఅవుట్ లేని స్థలాల్లో ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు కొనసాగుతున్న పట్టించుకోని పంచాయతీ గతపాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం సక్రమంగా చేపట్టిన లేఅవుట్లలో పంచాయతీలకు పనికివచ్చే స్థలాన్ని అయినా తీసుకోవడంలో ఎందుకు ఆసక్తి చూపడంలేదని స్థలకొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లుతీసుకెళ్లినా కూడా తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

● అంతా మాఇష్టం

ఎడపల్లి మండలంలో ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న అక్రమ, సక్రమ లేఅవుట్ స్థలాల నిర్వాహకులు, యజమానులు, కొనుగోలు చేసిన స్థల యజమానులు, పాలకులు, అధికారులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా అంతా మాఇష్టం అన్న చందంగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

● హద్దులు హుష్‌కాకి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లలో పంచాయతీలకు ఇచ్చిన స్థలానికి పంచాయతీ గతపాలకవర్గం, అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడం వెనుక దాగిఉన్న అంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు. దీంతో అవి రోజురోజుకు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ తతంగం ఎక్కువగా ఎడపల్లి, జానకంపేట్, ఏఆర్పీ క్యాంప్, నెహ్రూ నగర్ గ్రామాలలో వెలుగు చూస్తూనే ఉన్న అక్కడి నేతలు, అధికారులు నోరు మెదపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా మండలంలోని సుమారు 50కి పైగా సక్రమ, అక్రమ లేఅవుట్లు కొనసాగుతున్న వాటిపై పూర్తిస్థాయి నిఘాపెట్టి సక్రమ లేఅవుట్లలో హద్దులతో కూడిన పంచాయతీ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవడం, అక్రమ లేఅవుట్ స్థలాలలో కొనసాగుతున్న పనులను అధికారికంగా అడ్డగించడం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఏఆర్పీ గ్రామంలో అనుమతులు లేని లేఅవుట్

ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తప్పవు



మండలంలో కొనసాగుతున్న అక్రమ లేఅవుట్లపై తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మండల పంచాయతీ అధికారి రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఒకవేళ ఏదైనా అభ్యంతరాలు ఉండి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులకు నివేదికలో ఇచ్చిన స్థలమే మండల గ్రామ పంచాయతీల లేఅవుట్లలో ఒకటై ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేవని, తేడాఉంటే తప్ప కుండా అలాంటివాటి అనుమతులు రద్దుచేస్తామని మండల పంచాయతీ అధికారి రవి ప్రకాష్ రెడ్డి అన్నారు.

-ఇన్‌చార్జీ ఎంపీఓ రవి ప్రకాష్‌రెడ్డి

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



ఆర్మూర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకెఎస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మే21: ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఏకకాలంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు సారాసురేష్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు ఏపీ గంగారాం, యు.రాజన్న, మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడడానికి వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను 60శాతం సబ్సిడీపై అందజేయాలన్నారు. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయడానికి వెనుకడుగు వేస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రద్దు చేస్తు న్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీలను రద్దు చేసి రైతులపై భారం వేసిందన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు రూ.500బోనస్ ఇచ్చి హామీలను నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజే శారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకెఎస్ నాయకులు రమేష్, గంగాధర్, మల్ల న్న, అశోక్, లింబాద్రి, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని మాస్‌లైన్ నాయకులు అన్నారు. మంగళవారం మోర్తాడ్ మండల కేంద్రంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కిషన్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, మినీట్రాక్టర్‌లు సబ్సిడీపై ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కేవలం జనుము, జీలుగు పంపిణీ చేయడమే గాక అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు 50శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. బ్యాంకు అప్పులు తీసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకాన్ని వర్తింపజేశాయని, కేంద్ర ప్రభుత్వం ఫసల్‌బీమా అందరికి అని చెప్పి కొందరికి మాత్రమే వర్తింపజేస్తున్నాయని ఆరోపించారు. బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో సర్వేచేసి పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సురేష్, నాయకులు సత్తెక్క, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



కోటగిరిలో మాట్లాడుతున్న డీపీఓ తరుణ్ కుమార్

కోటగిరి,మే21: గ్రామాలలో సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ హెచ్చరించారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీని మంగళవారం డీపీవో తనిఖీ చేశారు. గ్రామంలో పలు కాలనీలను సందర్శించారు. పారిశుధ్య సమస్య అధ్వానంగా ఉండడంపై కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ, కంపోస్ట్ షెడ్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల వారిగా పన్నుల వసూళ్ల వివరాలు తెలుసుకున్నారు. వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నర్సరీలు, కంపోస్ట్ షెడ్డులు, ఇతరత్రా పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవోలు మారుతీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి



చలో బస్‌భవన్‌కు బయలుదేరుతున్న ఆర్మూర్ ఆర్టీసీ యూనియన్ సభ్యులు

పెర్కిట్, మే21: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో బస్ భవన్ కార్యక్రమానికి ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి అధ్యక్ష, కార్యదర్శులు రవిచందర్, రమేష్, సభ్యులు మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రి యను వెంటనే పూర్తి చే యాలని, చట్టం ప్రకారం టీఎస్ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్‌లను పునరు ద్దరించాలని అదే విధంగా 2013 ఆర్‌పీఎస్ బాండ్ డబ్బులను వెంటనే అం దరికి చెల్లించాలని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఖాళీలన్నింటిని భర్తీ చేసి పని భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుజాత, సుమలత, భూమన్న, గంగవ్వ, జ్యోతి, లత, శీను, హరి, రవీందర్, గంగాధర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బడా కార్పొరేటర్లకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటు



సాలూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బోదన్‌రూరల్,మే21: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సబ్సిడీ రద్దు చేసి బడా కార్పొరేటర్లకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు పండించడానికి సమాయత్తం అవుతున్నారని, రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. యంత్ర పరికరాలను, మిని ట్రాక్టర్లను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు సీహెచ్.గంగారాం, లచ్చరాం, లక్ష్మీబాయి, రాజన్న, సరస్వతి, లక్ష్మి, గంగయ్య, లక్ష్మణ్, రాజన్న, దత్తు, సంజీవ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నవీపేట,మే21: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన మంగళవారం అమ్మవారి కల్యాణం, సర్వాయి వేయుట, అఖండ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి బోనాల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి జయంతి



మోస్రాలో నరసింహస్వామి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మోస్రా,మే21: మండల కేంద్రంలోని మాసం చెరువు కట్ట వద్ద గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరాన్ని సుందరంగా పూలమాలతో సీరియల్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. గర్భగుడిలో స్వామి వారి విగ్రహాన్ని అభిషేకం చేసి పట్టుబట్టలతో పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణలో సత్యనారాయణ పూజ నిర్వహించారు. భక్తులకు ప్రసాదం వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సంతోష్, సుధీర్, వివిధ పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మి నర్సింహస్వామి జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేణు తెలిపారు. జయంతిలో భాగంగా ఉదయం ఏడు గంటలకు చందన అభిషేకం, 10 గంటలకు స్వామివారికి,అమ్మవారికి తిరు నక్షత్ర కల్యాణము, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పల్లకిసేవ, ఆ తరువాత స్వామి వారికి సేవలు నిర్వహించడం జరుగతుందని, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి జన్మోత్సవ వేడుకలలో పాల్గొనాలని ఆయన కోరారు

ఆర్మూర్‌రూరల్: కమ్మర్‌పల్లి మండల కేంద్రలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం వేదమంత్రోత్చరణలమధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగ నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటి అద్వర్యంలో నిర్వహించిన కల్యానోత్సవా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శివశర్మ వేదమంత్రాలమధ్య ఘనంగ జరిపించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ది కమిటి సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనగణనతో పాటు కుల గణన చేపట్టాలి

ముప్కాల్, మే21: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో జనగణనతో పాటు కుల గణన నిర్వహించాలని మహాత్మ గాంధీజ్యోతిరావుపూలే ప్రధాన కార్యదర్శి బీమన్‌పల్లి విఠోభ డిమాండ్ చేశారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అందులో బీసీలకు దామష ప్రకారం రిజర్వేషన్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రంలో మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు మండల కమిషన్ సిఫారసు మేరకు అమలు చేయాలన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో బీసీలకు ప్రకటించిన న్యాయమైన కోరికలను అమలు చేయాలని, అమలుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజికంగా ఆర్థిక, రాజకీయంగా అన్ని రంగాల్లో బీసీలకు మరిన్ని ప్రోత్సహకాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాస శ్యామ్, బండి మల్లేష్, కొత్తింటి సాయన్న, మదర్, సురేష్ సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బోధన్‌రూరల్,మే21: ప్రొఫెసర్ జయశంకర్‌ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సరిగాధ పరమేశ్వర్ ఆచార్య అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో విశ్వకర్మ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రహ్మణ విద్యార్థి, విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వస్ఫూర్తి ప్రతిభ పురస్కారాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగావిచ్చేసిన డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న విద్యార్థులందరు భవిష్యత్‌లో బాగా చదివి మంచి ఉద్యోగాలను సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్, రాఘవపురం గోపాలకృష్ణ ఆచార్య, కిరణ్‌కుమార్, మురహరి, శ్రీను, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సాయేందర్, శ్రీధర్, లక్ష్మినారాయణ, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు జనార్ధన్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీనియర్, అండర్-19 క్రికెట్ ఎంపికలు

సుభాష్‌నగర్,మే21: అండర్-19,సీనియర్ క్రికెట్ ఎంపికలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. నగరంలోని జీజీ కళాశాల మైదానంలో ఉదయం 7గంటల నుంచి ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పదవ తరగతి మెమో, ఆధార్‌కార్డ్, తెల్లని దుస్తులు, క్రికెట్ కిట్‌ను వెంట తీసుకొని రావాలని కోరారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు అందజేయాలి

నవీపేట,మే21: మండలంలోని వివిధ గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేయాలని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో 10సంవత్సరాల క్రితం ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేయగా తర్వాత ఇప్పటి వరకు ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి పనిముట్లు అందజేయలేదని అన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు నిర్వహించే చోట కూలీలకు నీడ ఏర్పాటు చేయాలని, పనులు జరిగే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్, భూంరావు, అబ్బన్న, సునీల్, లక్ష్మణ్, రాజశేఖర్, గంగాధర్ తదితరులున్నారు.



ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

రుద్రూరు,మే 21:సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తులకు ఎస్ఐ అప్పారావు రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌లను మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసుకుని వెంటనే ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అంద జేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

పైప్‌లైన్‌ను పరిశీలన

ఆర్మూర్‌టౌన్,మే21: మిషన్ భగీరథ పైప్‌లైన్ చెడిపోవడంతో మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం పైప్‌లైన్‌ను పరిశీలించారు. బాల్కొండ మండల కేంద్రంలో లింగమయ్య గుడి వద్ద గల మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమై లీకేజీ కావడంతో మున్సిపల్ పరిధిలో నీటి సమస్య తలెత్తింది. దీంతో ఆయన పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్స్‌పెక్టార్ నవీన్, తదితరులు ఉన్నారు.

అర్గుల్‌లో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే21: మండలంలోని అర్గుల్ గ్రామంలో మైనారిటీ గుట్టపై మూడు రోజుల నుంచి ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉర్సు ఉత్సవాలు జరగగా సోమవారం ఘనంగా జరిగాగ మంగళవారం మైనారిటీ గుట్టపై కవాలి కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మైనారిటీ గుట్ట వద్ద భక్తుల కోసం మూడు రోజుల పాటు అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాలను గురువు ముజీబ్‌అన్సరీ ఆధ్వర్యంలో జరిగయని మైనారిటీ పెద్దలు తెలిపారు. మంగళవారం ఉర్సు ఉత్సవాలు ముగిశాయని మైనారిటీ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురువు ముజీబ్‌అన్సరీ, మైనారిటీ పెద్దలు బడేమియా,పాషా,ఇంతిసరోద్దిన్,ఫారూఖ్,తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సంవత్సరం మన మైదానంలోనే శిక్షణ

● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్



మాట్లాడుతున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు

సుభాష్‌నగర్,మే 21: వచ్చే ఏడాది జిల్లాలో స్వంతంగా నిర్మంచిన స్టేడియంలోనే శిక్షణ శిబిరం నిర్వహించేలా కృషి చేస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది ప్రతిభవంతులైన క్రీడాకారులు ఉన్నారన్నారు. ఇందుకు నిదర్శనం బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న నిఖత్‌జరీన్, హుసామోద్దీలు అని తెలిపారు. జిల్లాలో సమ్మర్‌క్యాంపులు కాకుండా రెగ్యులర్ క్యాంపులుగా నిర్వహించేందుకు ఇక్కడే అధ్యక్ష,కార్యదర్శులు కృషి చేయాలన్నారు. దానికి హెచ్‌సిఏ తరఫున తోడ్పాడు అందిస్తామన్నారు. తెలంగాణా జిల్లాలో రంజీలు నిర్వహించేలా హెచ్‌సిఏ కృషి చేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో ఐదెకరాల స్థలంలో మంచి స్టేడియాన్ని నిర్మించవచ్చని మరో నాలుగు,ఐదెకరాలు తీసుకుంటే అధు నాత స్టేడియాన్ని నిర్మించవచ్చని అందుకు అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఏ కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్, నిజామాబాద్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేష్‌బాబు, పారస్ వినోద్, సీనియర్ క్రికెటర్లు లలిత్‌రెడ్డి, సూరజ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఝార్ఖండ్‌లోని వశిష్ట గుహ ఆశ్రమానికి చేరుకున్న భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు



ఝార్ఖండ్ వశిష్ట గుహ ఆశ్రమంలో ఉన్న భూమ యోగేశ్వర ఆశ్రమ సభ్యులు

నందిపేట, మే21: నందిపేట మండలంలోని కౌల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ పరమహంస భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు మంగళవారం ఝార్ఖండ్ రాష్ట్రంలోని వశిష్ట గుహ ఆశ్రమానికి చేరుకున్నారు. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో కౌల్‌పూర్ టూ బద్రీనాథ్‌కు పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. పాదయాత్ర 59వ రోజుకు చేరుకుంది. వశిష్ఠ గుహ ఆశ్రమం నుంచి మళ్లీ బద్రీనాథ్‌కు పాదయాత్ర చేపట్టినట్లు భక్తులు తెలిపారు. ఈ పాద యాత్రలో ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ దంపతులు, అలాగే భక్తులు గజ్జెల సత్యనారాయణ, ఎంబేరు నర్సయ్య, వన్నెల్‌దాస్ పార్థసారథి, ఎంబేరు సుధాకర్, శ్రీనివాస్ తధితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డులను నిర్వహణలోకి తీసుకురావాలి



చింరాజ్‌పల్లిలో పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిస్తున్న ఆర్మూర్ డీఎల్‌పీవో

నందిపేట, మే21: గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను నిర్వహణలోకి తీసకురావాలని ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నందిపేట మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామాన్ని డీఎల్‌పీవో శివకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులను, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. అవసరం మేరకే నిధులు ఖర్చు చేయాలని, నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఎల్‌పీవో ఆదేశించారు. రానున్న రోజుల్లో నల్లాలకు లీకేజీలు లేకుండా, మురికి కాల్వలను శుభ్రంగా ఉంచి, క్లోరినేషన్ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోరె కిరణ్ కుమార్, కార్యదర్శులు ప్రశాంత్, సాయికుమార్, కారోబార్ నంబూద్రి ప్రసాద్, సిబ్బంది తధితరులు ఉన్నారు.

వర్మి కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలి



నడిపల్లిలో వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్న సిబ్బందిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, మే 21: ఒక వైపు పన్నుల వసూళ్లతో పాటు మౌలిక సమస్యల పరిష్కారానికి చేయూతనందిస్తున్న పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డులలో వర్మి కంపోస్ట్ ఎరువులను తయారు చేసి రైతాంగానికి అందించడం వల్ల పంచాయతీలు ఆర్థికంగా బలోపేతంగా తయారుఅవుతాయని ఎంపీడీవో రవీందర్ , ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ లు సూచించారు. మంగళవారం నడిపల్లి గ్రామంలో సేంద్రీయ ఎరువుల తయారీ విధానం పరిశీలించిన ఎంపీడీవో , స్థానిక ఈవో నిట్టు కిషన్ రావు ను అభినందించారు. పంచాయతీ కార్యదర్శులు వర్మి కంపోస్ట్ తయారీ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

24న జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

జక్రాన్‌పల్లి, మే21: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24 తేదీన ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం పరిశీలన

మోర్తాడ్, మే21: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి ముత్తెన్న సందర్శించారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామంలో శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు తగు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనే విధంగా విద్యార్థులకు శిక్ష అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ ను అభినందించారు. క్రీడాకారులకు క్రీడా పరికరాలను ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్, క్రీడాకారులు ఉన్నారు.

జిల్లాలో రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ఎల్లారెడ్డి, మే 21: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజ్ పటేల్, చందు, యామ రాములు, కృష్ణారెడ్డి, అబ్దుల్ అహ్మద్ పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరిచిన యోధుడని, పరిపాలనలో ఎన్నో సంస్కరణలు తెచ్చి నవభారత నిర్మాణానికి పునాదివేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూమాగౌడ్, నాయకులు సలీలం, పరుషగౌడ్, స్వామి, మహేష్, సిద్ధిరాములు, అరుణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకులు

బిచ్కుంద: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంరెడ్డి, నౌషానాయక్, బస్వరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో భారతదేశం ఇంతముందు ఉందంటే దానికి కారణం కేవలం రాజీవ్‌గాంధీ పరిపాలన దక్షత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో, తిప్పాపూర్ గ్రామంలోని రాజీవ్‌గాంధీ విగ్రహాల వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు దయాకర్‌రెడ్డి, మద్దూరి రవి, బాబు, కర్నాల శ్రీను, మహేందర్, నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

బాన్సువాడ, మే 21: వర్షాకాలంలో రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన సబ్సిడీ జీలుగ విత్తనాలను మంగళవారం బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సబ్సిడీ జీలుగు విత్తనాలను తీసుకువెళ్లాలని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రైతులు పండిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుముల విత్తనాల పంపిణీని మండల కేంద్రంతో పాటు పోసానిపేట గ్రామాల్లో మంగళవారం పంపిణీ చేసినట్లు ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. రాయితీ పద్ధతులు పాటించి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమ్మకం చేయడంతో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. అమ్మకాలు 30 నుంచి 60 శాతం ఉండడంతో రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు

బాన్సువాడ టౌన్, మే 21: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు అభిషేకం, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో స్వామి వారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.


రైతునగర్, కొల్లూరు సరిహద్దులను పరిశీలిస్తున్న అధికారులు

రైతునగర్‌లో క్యాంప్ విలీనానికి కసరత్తు

● సరిహద్దులను పరిశీలించిన అధికారులు

బీర్కూర్, మే 21: మండలంలోని రైతునగర్ గ్రామం ఏళ్ల క్రితం రెండు భాగాలుగా విభజించబడింది. ఒక భాగం బీర్కూర్ మండలంలో కొనసాగుతుండగా మరో భాగం రైతునగర్ క్యాంప్ బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామ పంచాయతీలో విలీనం చేయబడింది. దీంతో క్యాంప్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక ఊరిలో అందరూ కలిసి మెలిసి ఉంటున్నా ఓట్లు వేయాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా ఏదైనా పనికి బాన్సువాడ మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా క్యాంప్ ప్రజలు తమను రైతునగర్‌లో విలీనం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్డీవో ఆదేశాల మేరకు మంగళవారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, బీర్కూర్ ఎంపీడీవో భారతిలు సర్వేయర్, జీపీ కార్యదర్శులతో కలిసి రైతునగర్‌ను సందర్శించారు. గ్రామాల సరిహద్దులను పరిశీలించారు. అనంతరం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నో ఏళ్లుగా బాన్సువాడ మండలం కొల్లూరు జీపీలో కొనసాగుతున్న రైతునగర్ క్యాంప్‌వాసుల కళ త్వరలో నెరవేరనుందని అధికారులు తెలిపారు.

ఎల్లారెడ్డిలో డెంగీ వ్యాధితో బాలుడి మృతి


మనిదీప్(ఫైల్)

ఎల్లారెడ్డి, మే 21: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ప్యాలాల కృష్ణ కుమారుడు మనిదీప్(10) గత 20 రోజులుగా డెంగ్యూ వ్యాధి సోకి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. మృతుడి తండ్రి కృష్ణ మున్సిపల్ కార్యాలయంలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పల్లె దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన


బస్వాపూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 21: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పల్లె దవాఖాన నిర్మాణానికి మంగళవారం భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మార్కెట్ స్థలంలో పల్లె దవాఖాన రూ.17లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. పనులను త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్, నాయకులు మల్లారెడ్డి, బాగారెడ్డి, సిద్ధరాములు, తుడుం జీవన్, బాబు, ఎల్లం, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

● డీఆర్‌డీవో చందర్ నాయక్

నాగిరెడ్డిపేట, మే 21: ఉపాధిహామీ కూలీలు కొలతల ప్రకారమే పనులు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్ నాయక్ ఉపాధి హామీ కూలీలను కోరారు. ఆయన మంగళవారం మండలంలోని వదల్పర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ ద్వారా చెరువులో పూడిక తీత పనులను పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం దినసరి కూలీ రూ.300 చెల్లిస్తుందని, కొలతల ప్రకారమే జరపాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన బడి పిల్లల యూనిఫాం కుట్టడం, చేపల పెంపకం, 2024-25 సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా చేపట్టబోయే కార్యక్రమాల గురించి సమీక్షించారు. సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన సమయంలోనే అన్ని కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో పర్బన్న, ఏపీఎం జగదీష్‌కుమార్, ఉపాధిహామీ ఏపీవో సాయిలు, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, మండల సమైక్య సిబ్బంది రవి, రాజు పాల్గొన్నారు.


వదల్పర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

సదాశివనగర్: మండలంలోని పద్మాజీవాడిలో సెంట్రల్ సెక్రెటరియట్ టీం ఉపాధి హామీ పనులను మంగళవారం సందర్శించారు. గ్రామంలో రోజుల పాటు సందర్శించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, మౌలిక వసతుల వివరాలను గ్రామస్థుల నుంచి సేకరించి పై అధికారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. రైతు వేదికలో అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ వారితో, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిత తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాన్సువాడ, మే 21: మండలంలోని బోర్లం దగ్గర ఉన్న చెరువులో ఒక గుర్తు తెలియని మగ మనిషి మృత దేహం మంగళవారం సాయంత్రం 6 గంటలకు గుర్తించినట్లు బాన్సువాడ పట్టణ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మగ మనిషి మృత దేహం బోర్లం గ్రామంలోని చెరువులో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వచ్చి చెరువులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగింది.

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు

దోమకొండ, మే 21: మండలంలోని గొట్టిముక్కుల గ్రామ శివారులో ముగ్గురు రైతుల యొక్క బోరు మోటర్‌కు సంబంధించిన స్టాటర్ డబ్బా, సింగిల్ ఫేజ్ మోటర్, ఉల్లిగడ్డను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయమై రైతులు దోమకొండ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 7వ తేదిన ఫిర్యాదు చేశారు. ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రైతుల యొక్క బోరుబావుల వద్ద చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చోరీకి పాల్పడిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ ఆకస్మిక తనిఖీ

దోమకొండ, మే 21: దోమకొండ సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న పీఎంఐ మరమ్మత్తు పనులను క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మాధవరావు పరిశీలించారు. 33కేవీ పనులు, 11 కేవీ ఫీడర్‌లను తనిఖీ చేశారు. విద్యుత్ నిరంతరాయంగా అందించాలని ఆదేశించారు.అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, వెంకటకృష్ణ, ఏడీఈ కిరణ్ చైతన్య ఏఈలు పాల్గొన్నారు

ఆలయ వార్షికోత్సవానికి హాజరుకావాలి

దోమకొండ, మే 21: మండలంలోని అంచనూర్ గ్రామంలోని రేణుకాదేవి అమ్మవారి 4వ వార్షికోత్సవం ఉత్సవాలకు హాజరుకావాలని మంగళవారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. 25 నుంచి అంచనూర్‌లో జరిగే ఎల్లమ్మ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు స్వామిగౌడ్, శంకర్‌గౌడ్, రామస్వామిగౌడ్, రవి కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

పాట్నా ఐఐటీలో పట్టా పొందిన భిక్కనూరు వాసి

భిక్కనూరు, మే 21: పాట్నా ఐఐటీలో మంగళవారం జరిగిన పదవ స్నాతకోత్సవంలో భిక్కనూరు గ్రామానికి చెందిన గజ్జెల శ్రీలేఖ ఐఐటీ పట్టా అందుకున్నారు. 2019బ్యాచ్‌కు చెందిన శ్రీలేఖ జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించి పాట్నా ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించిన జిల్లాకు చెందిన ఏకైనా విద్యార్థిని. ఈ సందర్భంగా శ్రీలేఖ మాట్లాడుతూ.. ఐఐటీ పాట్నాలో చదివి పట్టా పొందడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కాగా గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ గజ్జెల భిక్షపతి కూతురు శ్రీలేఖ. కాగా ఐఐటీ పట్టా సాధించి శ్రీలేఖకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు.


పోచారం తండాలో స్తంభానికి సీసీ కెమెరా


పోచారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దృశ్యాలను రికార్డు చేస్తున్న మానిటర్

మారుమూల పల్లెల్లో నిఘా నేత్రాలు

● గ్రామాల్లో తగ్గిన నేరాల సంఖ్య

● బాన్సువాడ డివిజన్‌లో అత్యధిక సీసీ కెమెరాలు

పెద్ద కొడప్‌గల్, మే 21: కామారెడ్డి జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాలలో పెద్ద కొడప్‌గల్ మండలం ఒకటి. జిల్లా కేంద్రానికి ఈ మండలంలోని గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో ఉంటాయి. కొత్త మండలం ఏర్పడగానే దీంతో పాటుగానే శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండలానికి దూరంగా కొన్ని గ్రామాలు ఉండటంతో పాటు, మరి కొన్ని గ్రామాలలో తరచూ గొడవలు జరిగేవి. దీంతో అప్పట్లో పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ గా పనిచేసిన నవీన్ కుమార్ గ్రామాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండ ఆయా గ్రామాల ప్రజల సహకారంతో మండలంలోని ఆయా గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించారు. మండలంలో 23 గ్రామాలు ఉండగా మెజారిటీ గ్రామాలలో సిసి కెమెరాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం గ్రామాలలో ఎలాంటి గొడవలు, దొంగతనాలు జరగకుండ సిసి కెమెరాలు కాపాడుతున్నాయి. గతంలో చిన్న చిన్న విషయాలకు గొడవలు పడే గ్రామస్తులు ప్రస్తుతం సిసి కెమెరాల బిగింపుతో గొడవలకు దూరంగా ఉంటున్నారు. అంతేగాక గ్రామంలో ఎటువంటి నేరాలకు పాల్పడకుండ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. అంతేగాక కొత్తవారు కూడ సిసి కెమెరాలు ఉన్న గ్రామాలకు వచ్చి నేరాలు చేయాలంటే భయపడే పరిస్థితి కలిగింది. ఇక గ్రామాలలో సిసి కెమెరాలు ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు నిశ్చితంగా తమ పనులు తాము చేసుకుంటూ ప్రశాంతంగా ఉంటున్నారు. ఒక సిసి కెమెరా 10 మంది పోలీసులతో సమానం అన్నట్లుగా ఉండటంతో మండలంలోని సిసి కెమెరాలు ఉన్న గ్రామాలు ప్రశాంతంగా ఉంటునాయి.

డివిజన్‌లోనే అత్యధిక సీసీ కెమెరాలు కలిగిన మండలం..

బాన్సువాడ డివిజన్‌లోనే పెద్ద కొడప్‌గల్ మండలం అత్యధిక సీసీ కెమెరాలు కల్గిన మండలంగా గుర్తింపు పొందింది. ఈ మండలంలో పనిచేస్తున్న పోలీసులు ఆయా గ్రామస్థుల సహకారంతో మండలంలో 23 గ్రామాలు ఉండగా, మెజారిటీ గ్రామాలలో సిసి కెమెరాలు బిగించారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో ఉన్న పోచారం తాండ, విఠల్‌వాడీ, విఠల్‌వాడీ తాండ, లింగంపల్లి పెద్ద దేవిసింగ్‌తాండ తదితర గ్రామాలలో సిసి కెమెరాలు బిగించారు. దీంతో ఈ గ్రామాలు మండల కేంద్రానికి దూరంగా ఉన్న నేరాలు జరగడం లేదు. సిసి కెమెరాలు ఉన్నాయన్న భయంతో గ్రామస్తులు ఎలాంటి సంఘటనలకు పాల్పడటం లేదు. దీంతో ఎలాంటి గొడవలు జరగకుండ ఉండేందుకు సిసి కెమెరాలు పోలీసులకు సహాయకారిగా ఉంటున్నాయి. గతంలో పోచారం తాండలో సిసి కెమెరాలు ప్రారంభించడానికి అప్పటి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వచ్చారు. గ్రామస్తుల సహకారంతో ఈ మండల వాసులు తమ గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఇతర గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గాయి..

: కోనా రెడ్డి, ఎస్ఐ



పెద్ద కొడప్‌గల్ మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా మెజారిటీ గ్రామాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో సిసి కెమెరాలు లేని గ్రామాల నుండి చిన్న చిన్న పంచాయితీలు, గొడవలతో ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారు. ప్రస్తుతం సీసీ కెమెరాలు ఉన్నాయన్న భయంతో ప్రజలు ఎలాంటి గొడవలు పెట్టుకోవడం లేదు. గ్రామాలలో నేరాల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. గ్రామాలలో జరిగిన కొన్ని ఘటనల్లో సిసి కెమెరాలు పోలీసులకు బాగా ఉపయోగ పడ్డాయి. కొత్త వారు కూడ గ్రామాలలో ఏదైనా నేరం చేయాలంటే భయపడుతున్నారు. దీంతో పాటుగానే రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు కూడ సిసి కెమెరాలు ఉపయోగ పడుతున్నాయి. దీంతో ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తించి బాధితులకు న్యాయం చేయడానికి వీలవుతుంది. మొత్తానికి సీసీ కెమెరాల బిగింపుతో మాకు చాలా ఉపయోగం ఉంది. బాన్సువాడ డివిజన్‌లోనే మా మండలంలోనే అత్యధికంగా గ్రామాలల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి.

టీయూ పరిధిలో ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

● 429మంది విద్యార్థులు గైర్హాజరు


డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్‌యాదగిరి

డిచ్‌పల్లి, మే 21: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్, పరీక్షలుఉదయం 1,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని 38పరీక్ష కేంద్రాల్లో జరిగిన రెగ్యులర్ పరీక్షలకు 8931 అభ్యర్థులకు గాను 8534 మంది హాజరుకాగ 398 విద్యార్థులు గైర్హాజరయ్యారని, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 386 మంది విద్యార్థులకు గాను 354 పరీక్షకు హాజరయ్యారని, 32మంది విద్యార్థులు ఈపరీక్షలకు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 4ప్రత్యేక స్క్వాడ్ బృందాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్ర శేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, నిజామాబాద్, కామారెడ్డిలోని పలు పరీక్ష కేంద్రా లను తనిఖీలు నిర్వహించినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పెద్ద కొడప్‌గల్, మే 21: తాగుడుకు బానిసై యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒకటి పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి చెందిన గైని తుకారం వృత్తిరీత్యా హోటల్ నిర్వహణతో పాటు వంట మాస్టర్‌గా పని చేస్తుంటాడు. తుకారాంకు ఇద్దరు భార్యలు కాగా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆర్థికంగా ఉండే ఇబ్బందులకు తోడు తాగుడుకు బానిసైన తుకారాం తన ఇంట్లో చీరతో ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ కోనారెడ్డి తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210